క్లుప్తంగా

వృద్ధులకు అన్నసమారాధన

గుడివాడ టౌన్: స్థానిక శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం స్థానిక పాటిమీద గల కరుణాపీఠం, బేతవోలు లోని శాంతి వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. యాదవ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు తాతా సాయి మురళీకృష్ణ-మోహన నాగలక్ష్మి దంపతుల వితరణతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, సేవా సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్, డీఆర్‌బీ ప్రసాదు, సయ్యద్ గఫార్, ఎం.సత్యం, హరిబాబు, జాజుల తాతారావు పాల్గొన్నారు.

మొవ్వ మండలంలో నాలుగు లక్షల పనిదినాలు



మొవ్వ: 2024-25 ఆర్థిక సంవత్సరానికి మొవ్వ మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నాలుగు లక్షల ఉపాధి పని దినాలు కల్పించే విధంగా ప్రభుత్వం నిర్దేశించినట్లు ఏపీఓ కే లక్ష్మీరెడ్డి తెలిపారు. ఉదయం 5.30 నుంచి 10.30 గంటల లోపు పనులు నిర్వహించాలని, రోజువారి వేతనంగా రూ.300 కేంద్ర ప్రభుత్వం నిర్దేశించినట్లు పేర్కొన్నారు. మంగళవారం మొవ్వ మండలంలోని 21 గ్రామాల్లో 105 పంట బోదుల పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ పనుల్లో 4,478 మంది కూలీలు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

జవహర్ నవోదయకు విద్యార్థి ఎంపిక



పమిడిముక్కల: ఐనపూరు ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న గడ్డం వినయ్ కుమార్ జవహర్ నవోదయలో 6వ తరగతి ప్రవేశానికి ఎంపికయ్యాడు. ఎంఆర్‌సీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థి వినయ్‌కుమార్‌ను, శిక్షణ ఇచ్చిన హెచ్ఎం గిరిధర సుబ్బారావును ఎంఈఓ-2 శ్రీనివాస్ అభినందించారు. సీఆర్పీలు బాబూరావు, బిందు, నాగరాణి పాల్గొన్నారు.


గుడివాడ కాంగ్రెస్ అభ్యర్థిగా వద్దాది రాజేష్



వద్దాది రాజేష్

గుడివాడ టౌన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గుడివాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వద్దాది గోవిందయ్య(రాజేష్) ఎంపికైనట్లు రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ హైకమాండ్ విడుదల చేసిన జాబితాలో తనను అభ్యర్థిగా ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీల పాత్ర పోషిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. 20 సంవత్సరాలుగా వద్దాది చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇచ్చామని, ప్రజలు తనను ఆదరిస్తారని రాజేష్ పేర్కొన్నాన్నారు.


పామర్రు అభ్యర్థిగా డీవై దాసు



డీవై దాసు

పామర్రు: పామర్రు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా డీవై దాసుని ఎంపిక చేస్తూ మంగళవారం జాబితాను ఆ పార్టీ ప్రకటించింది. ఈ మేరకు డీవై దాసు మాట్లాడుతూ తాను 2009 నుంచి 2014 వరకు పామర్రు ఎమ్మెల్యేగా ఉంటూ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించానని పేర్కొన్నారు.

టెక్నికల్ ఈవెంట్‌లో ఏఎన్నార్ విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: కేఎల్ యూనివర్సిటీ బి-స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఏ టెక్నికల్ ఈవెంట్ తార్కష్య - 24 వే టూ క్లియర్'లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించారని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ మంగళవారం తెలిపారు.

ఈ ఈవెంట్‌లో తమ కళాశాల ఎంబీఏ విద్యార్థులు ఎ.శ్యామ్ కిషోర్, ఎస్.సుబ్రహ్మణ్యం, జి. నాగపవణ్, ఎన్. భానుప్రసాద్, షేక్ రుక్సానా ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, ఎంబీఏ విభాగాధిపతి ఎంబీ సువర్చల, బీఎస్ఎస్ పద్మజ అభినందించారు.

ఎమ్మెల్యే కొడాలి నాని ప్రచారానికి ప్రజల బ్రహ్మరథం



ఓటర్లకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని



ఎమ్మెల్యే కొడాలి నానికి తిలకం దిద్దుతున్న వృద్ధురాలు

గుడివాడ టౌన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలపర్చాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ ఎమ్మెల్యే కొడాలి నాని చేస్తున్న ఎన్నికల ప్రచారానికి మంగళవారం ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పట్టణంలోని 13వ వార్డు బాపూజీ నగర్, గుడ్‌మెన్‌పేట తదితర ప్రాంతాల్లో గడప గడపకు తిరుగుతూ తనను, ఎంపీ అభ్యర్థిని గెలిపించాలంటూ ఓటర్లను కోరారు. తొలుత బాపూజీనగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలతో ఈ ప్రచారం ప్రారంభించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళలు పూలవర్షం కురిపించారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం కార్యకర్తలు కొడాలి నానికి క్షీరాభిషేకం చేశారు. కొడాలి నాని గడప గడపకు తిరుగుతూ ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ లేనిదీ వివరాలు కోరారు. మహిళలు తమకు జగన్ మోహన్‌రెడ్డి అందజేస్తున్న అన్ని పథకాలు అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. కొడాలి నానితో కలిసి బాపూజీనగర్ మహిళలు గడప గడపకు తిరిగి కొడాలి నాని నాయకత్వం వర్ధిల్లాలి, కొడాలి నానికే తమ ఓటు అంటూ నినాదాలు చేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, పేదల సంక్షేమం మరింత పెరగాలన్నా జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి అధికారంలోకి రావాలని కొడాలి అన్నారు. చంద్రబాబు నాయుడు మాట మార్చే నేర్పరి అని చంద్రబాబు, టీడీపీ నాయకులు మాటలతో ఎరవేస్తారని, ఆయన మాయమాటలు నమ్మవద్దని ఓటర్లను కోరారు. రాజకీయ స్వార్థం కోసం పెన్షనర్ల పొట్టకొట్టిన దుర్మార్గుడు చంద్రబాబు నాయుడన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి అద్దేపల్లి పురుషోత్తం, జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, జిల్లా ప్రధాన కార్యదర్శి మెండా చంద్రపాల్, రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, నాయకులు పాలడుగు రామ్ ప్రసాద్, మెండా కిరణ్, బెజ్జం సువర్ణరాజు, తంటేపూడి అనిల్, చుండూరి శేఖర్, టీవీ రమణకుమార్, వెంపటి సైమన్, రావులకొల్లు సుబ్రహ్మణ్యం, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు చింతల భాస్కరరావు, వీరిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం సాధ్యం

ఎమ్మెల్యే డీఎన్నార్



ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కలిదిండి: అర్హులందరికీ విద్య, వైద్యం, సంక్షేమ పథకాలు అందించడంతో పాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కలిదిండి పరిధిలోని 8వ రోజు 10వ వార్డులో గుడ్‌మార్నింగ్ కలిదిండి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కులం, మతం, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలవారికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని అన్నారు. ఎన్నికల సమయంలో పలు హామీలు గుప్పించి తర్వాత ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమన్నారు. ఇక్కడి మాజీ మంత్రికి ఎన్నికల సమయంలోనే నియోజకవర్గం గుర్తుకు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, సర్పంచ్ మసీముక్కు మారుతి ప్రసన్న, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ కూసంపూడి కనకదుర్గారాణి, కట్టా నాగలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యులు షఫాయితుల్లా, నీలి సుమన్, పీఏసీఎస్ అధ్యక్షులు వడుపు రామారావు, ఛాన్‌బాషా, కందుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సేవాగుణం కలిగిన డీఎన్నార్‌ను గెలిపించండి

కైకలూరు: నియోజకవర్గ ప్రజలందరికీ పార్టీలతో సంబంధం లేకుండా సేవ చేయాలనే లక్ష్యంతో పరిపాలన అందించిన ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)ను మరో పర్యాయం ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన సతీమణి వీరాకుమారి ఓటర్లను కోరారు. మంగళవారం వింజరం గ్రామంలో ఆమె ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని చేశారు. ఎంపీపీ అడవి కృష్ణ, వింజరం, గోపవరం, వేమవరప్పాడు సర్పంచ్‌లు ధర్మరాజుల నాగమణి, ఉలిసి వసంతకుమారి, నున్న రాంబాబు, నాయకులు ధర్మరాజుల సూర్యనారాయణ, అంబటి కృష్ణ, సోబుల సత్యనారాయణ, మోహనరావు, పోతురాజు, సన్నిధి కృష్ణ, నేతల యోహాను, చింతయ్య, మాసియ్య, శ్రీనివాసరావు, సామ్యేలు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



వింజరంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్ సతీమణి వీరాకుమారి

జగనన్నను గెలిపించుకుందాం

కలిదిండి: పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుని సంక్షేమ పథకాలను కొనసాగించుకుందామని ఎమ్మెల్యే డీఎన్నార్ పెద్ద కోడలు శ్రీఅనుపమ అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారం భాగంగా ఎస్ఆర్‌పీ అగ్రహారం, పడమటిపాలెం గ్రామాల్లో నాయకులతో కలిసి మంగళవారం ఇంటింటా ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్ సీపీని ఆదరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ కైకలూరు ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, పడమటిపాలెం సర్పంచ్ సాన మీనా సరస్వతి పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యుడు విజయ్‌కుమార్

ఎలకుర్రు(పామర్రు): అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆటిజంతో జన్మించే పిల్లలు ఎక్కువగా పుడుతున్నారని, ఇది జీవితాంతం వెంటాడే సమస్య అని దీనిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ప్రముఖ వైద్యులు కె విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఎలకుర్రు గ్రామంలో కేడీబీ ట్రస్టు ప్రాంగణంలో ప్రపంచ ఆటిజం డే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటిజంతో జన్మించిన పిల్లలున్న తల్లిదండ్రులు సిగ్గుపడకుండా వారిని పునరావాస కేంద్రాలలో తప్పనిసరిగా చేర్పించాలన్నారు. ఈ కేంద్రాలకు తీసుకొచ్చిన పిల్లలకు, వీరిని తీసుకొస్తున్న తల్లిదండ్రులకు సమాజానికి ఇటువంటి పిల్లలు జన్మించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారన్నారు. ఒక వేళ అటువంటి బిడ్డలు జన్మించినట్లయితే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ కేంద్రాల్లో తెలియజేస్తారన్నారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కేడీబీ ట్రస్టు నిర్వాహకులు కాశీనాథుని నాగేశ్వరరావు, ప్రభుత్వ కంటి వైద్య నిపుణురాలు ప్రసన్న సుందరి, వైద్య ఎంపీహెచ్ కేవీఎస్ శంకర్‌రావు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

పమిడిముక్కల: మండలంలోని వీరంకిలాకు కేఎస్ఆర్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ మండల కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్ తెలిపారు. కార్యాలయాన్ని మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం బూత్ కమిటీ, కార్యకర్తల సమావేశం జరుగుతుందని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వీరాంజనేయుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



పామర్రు: ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం పాల్గుణ మాసం చివరి మంగళవారం కావడంతో ఆలయం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి విశేషంగా ఆవుపాలు, పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు. అనంతరం వడమాల, పుష్పమాలతో స్వామిని పూజించి అలంకరించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలోనే పాల పొంగళ్ల వండి స్వామికి నివేదన సమర్పించి, మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఓటరు చైతన్య యాత్ర రథాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్వో శ్రీదేవి

పామర్రు: బాధ్యత గల పౌరులుగా ప్రతిఒక్కరూ తన ఓటు హక్కును వినియోగించుకోవాలని పామర్రు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిని బూసి శ్రీదేవి అన్నారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో సార్వత్రిక ఎన్నికలు-2024 సందర్భంగా ఓటర్లకు అవగాహన కోసం ఏర్పాటు చేసిన ఓటరు చైతన్య రథాలను ఆమె సహాయ ఎన్నికల అధికారులతో కలిసి జెండా ఊపి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఓటర్లను చైతన్య పరిచేందుకు, ఓటింగ్ శాతం పెరిగేలా ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించేందుకు ఓటర్ చైతన్య రథాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. చైతన్య రథాలతో పాటు సాంస్కృతిక కళాకారుల బృందం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించకోవడం, స్వేచ్ఛగా ఓటు వేయడం అంశాలపై ప్రసారమాధ్యమాలు, కళారూపాలు, ఆటపాటలతో ఓటు విలువపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పామర్రు తహసీల్దార్ శ్రీపల్లవి పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



కవాతులో పాల్గొన్న సీఐ, ఎస్ఐ

అయ్యంకి(మొవ్వ): జనరల్ ఎలక్షన్స్-2024ను పురస్కరించుకుని పామర్రు సర్కిల్, కూచిపూడి పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ ర్యాలీని మొవ్వ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్, పామర్రు సీఐ సుభాకర్, కూచిపూడి ఎస్ఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ దళాలతో కలిసి కవాతు నిర్వహించారు.

వరకట్నం వేధింపులపై కేసుల నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం వణుకూరు గ్రామం పడమటిచెరువు ప్రాంతానికి చెందిన నామాల వీణ 2022వ సంవత్సరంలో తెనాలికి చెందిన అంబటి మదన్‌ను పెద్దల సమక్షంలో కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. భర్త టింబర్ వ్యాపారం చేస్తాడని, హైదరాబాద్‌లో కూడా వ్యాపారం ఉందని తెలిపారు. వీణ బీటెక్, ఎంబీఏ చదివింది. పెళ్లి జరిగిన కొద్ది రోజులకు హైదరాబాద్‌లో కాపురం పెట్టారు. కొద్ది రోజుల కాపురం సాఫీగానే జరిగింది. అయితే ఆ తరువాత అదనపు కట్నం కావాలని భర్తతో పాటు అత్త అంబటి వెంకటరమణమ్మ, అడపడుచు భాగ్యాలు, లీల వేధింపులకు గురిచేయటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దీంతో అత్తింటి వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

యనమలకుదురులో..

పెనమలూరు: యనమలకుదురులో వరకట్నం కోసం వేధించిన అత్తింటి వారిపై మంగళవారం కేసు నమోదు చేశామని పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపారు. యనమలకుదురు ఇందిరానగర్‌కు చెందిన కొప్పనాతి లత పెనమలూరుకు చెందిన కొప్పనాతి రాజేష్‌ను 2022వ సంవత్సరంలో పెద్దల సమక్షంలో వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. భర్త ప్రైవేటు కంపెనీలో ఉన్నత ఉద్యోగం అని తెలిపారు. అయితే పెళ్లి జరిగిన తరువాత నుంచి భర్తతో పాటు అత్త, మామలు చాముండేశ్వరి, వెంకటేశ్వరరావు, ఆడపడుచులు పీతకరుణకుమారి, మైలవరపు జ్యోతి ఆమె భర్త రాకేష్, బంధువులు లోకేష్, శివలు అదనపు కట్నం కోసం వేధించసాగారు. భర్తకు సరైన ఉద్యోగం కూడా లేదని తెలిసింది. పెద్ద మనుషులు ఇరు కుటుంబాల మధ్య రాజీ చేసినా అదనపు కట్నం కావాలని అత్తింటి వారు డిమాండ్ చేశారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడులో జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామంలోని చింతపల్లి లక్ష్మికి చెందిన తాటాకుల ఇంటి పైకప్పుపై మంగళవారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు మంటలు అదుపు చేసేందుకు యత్నించారు. సమాచారం అందుకున్న హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హుటాహుటిన సంఘటనాస్థలికి చేరుకుని మంటలు అదుపు చేశారు. కాగా, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించినట్లు ఫైర్ సిబ్బంది ప్రాథమికంగా భావిస్తున్నారు. రూ.3 లక్షలు ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాంగ్ రూట్‌లో నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ ఓ వ్యక్తిని తీవ్రంగా గాయపర్చిన సంఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన దేవరకొండ శివశంకర్ సోమవారం రాత్రి 10 గంటల సమీపంలో ద్విచక్ర వాహనంపై హనుమాన్‌జంక్షన్ వచ్చి తన ఇంటికి తిరిగి వెళ్తుండగా హెచ్ మార్ట్ సమీపంలో రాంగ్ రూట్‌లో అతి వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో శివశంకర్ తలకు బలమైన గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ కేసు నమోదు చేశారు.

వెలమ సామాజిక పింఛన్ల పథకం ప్రారంభం

మండవల్లి: మండవల్లి శ్రీరామ మందిరం వద్ద బొబ్బిలి పాపారాయుడు ట్రస్ట్ ఆధ్వర్యంలో కొప్పుల వెలమ సంఘం సామాజిక పింఛన్ల పథకం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకుడు గంగునేని వరప్రసాద్ మాట్లాడుతూ సామాజిక వర్గంలో పేదవారిని గుర్తించి ప్రతి నెలా రూ.500 చొప్పున చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. ఐదుగురు సభ్యులతో మొదలైన పింఛను పథకం నియోజకవర్గంలో దాతల సహకారంతో ముందుకు తీసుకెళ్లాలని కమిటీ సభ్యులను కోరినట్లు తెలిపారు. గంగునేని లక్ష్మణరావు, గొర్రెపాటి నరసింహారావు, గొర్రెల శ్రీనివాసరావు, గంగునేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీని త్వరగా పూర్తి చేయాలి

పామర్రు: మొబైల్ వాహనం ద్వారా రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని తహశీల్దార్ శ్రీ పల్లవి అన్నారు. మొబైల్ వాహనం ద్వారా రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 45 శాతం 7,901 మందికి రేషన్ పంపిణీని పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. నూరుశాతం అందరికీ రేషన్ సరఫరా జరిగే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

నందివాడ: సాధారణ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని నందివాడ జాతీయ రహదారిపై ఎస్ఐ చంటిబాబు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలను మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రూ.50 వేలకు మించి తీసుకెళ్లకూడదని పేర్కొన్నారు. ఒకవేళ నగదు తీసుకెళ్తే తగిన ఆధారాలు తమ వెంట ఉంచుకోవాలన్నారు. వాహనాల తనిఖీలకు ప్రతి వాహనదారులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

నేడు భక్తాంజనేయ విగ్రహ పునఃప్రతిష్ట

కైకలూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ సమీపంలో శ్రీభక్తాంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమం మంగళవారం రెండో రోజుకు చేరింది. యాగశాల పూజ, కుంభస్థాపన, గణపతి పూజలను దూలం వీరశ్యామ్ ఫణికుమార్, బోను రాజేష్ దంపతులు నిర్వహించారు. శ్రీ భక్తాంజనేయ, శ్రీనాగమణి సహిత నాగరాజు, నూతన శిఖర, శ్రీ గణపతి విగ్రహ ప్రతిష్టలు బుధవారం ఉదయం 9.14 గంటలకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. అనంతరం అఖండ అన్నసమారాధన ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జంపన రామలింగరాజు, కొండరాజు, బుర్ల సత్యనారాయణ, దుర్గారావు, సింహాచలం, కరేటి శివకృష్ణ, సామిరెడ్డి నారాయణ, వసుంధర మురళీ పాల్గొన్నారు.

వలంటీర్ ప్రచారంలో పాల్గొనలేదు

వెల్లడించిన రిటర్నింగ్ అధికారి

కలిదిండి: మండలంలో కలిదిండి-2 గ్రామ సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్న షేక్ అబ్దుల్లా ఎటువంటి రాజకీయ పరమైన కార్యక్రమంలో పాల్గొనలేదని కైకలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.భాస్కర్ మంగళవారం తెలిపారు. షేక్ అబ్దుల్లా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లుగా వచ్చిన వార్త అవాస్తమని పేర్కొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

కలిదిండి: ఎన్నికల విధుల్లో భాగంగా కలిదిండి మండలం మట్టగుంట, అమరావతి, సంతోషపురం, కొండంగి గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ వంశీ మంగళవారం పరిశీలించారు. బూత్ లెవల్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలని చెప్పారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ప్రజలంతా సహకరించాలని కోరారు.

నిబంధనలు పాటించని టీడీపీ నాయకులు



గుడివాడ టౌన్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా నిబంధనలు తుంగలో తొక్కి టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. పార్టీ రంగు పసుపు రంగుతో ఉన్న తాగునీటి ట్యాంకర్‌ల ద్వారా యథేచ్ఛగా పట్టణంలో నీటి సరఫరా చేస్తున్నారు. ఈ విషయాన్ని అధికారులు సైతం పట్టించుకోపోవడాన్ని స్థానికులు తప్పుపడుతున్నారు.

కళాకారులకు టీ షర్టుల పంపిణీ



00000000

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు అంబేడ్కర్ నగర్‌లో డప్పు కళాకారులకు రూ.10వేల విలువైన టీ షర్టులను హై 5 యూత్ గౌరవాధ్యక్షురాలు కొల్లిపర అనసూయ, పార్థసారథి దంపతులు మంగళవారం అందజేశారు. వాసవి జాగృతి ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు టి.వేణుగోపాలరావు చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు నాగబాబు, రంగారావు, మోహన్‌బాబు, మురళి, శ్రీనివాసరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.